క్లుప్తంగా

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక



జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైన లక్ష్మీప్రియతో ఉపాధ్యాయులు

కె.గంగవరం: కుందూరు ఉన్నత పాఠశాలకు చెందిన గుబ్బల కుందన లక్ష్మీప్రియ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల రామచంద్రపురంలో జరిగిన జూనియర్ అథ్లెటిక్స్ మీట్ అండర్–14 విభాగంలో ప్రథమ స్థానం సాధించి జాతీయ స్థాయికి అర్హత సాధించారు. లక్ష్మీప్రియను ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ పంపన సత్యానందం, మాజీ సర్పంచ్ బత్తుల విజయకుమారి, గ్రామ పెద్దలు బత్తుల అప్పారావు, పంపన సుబ్బారావు, హెచ్ఎం చింతలపూడి ఆదినారాయణ మూర్తి, వ్యాయామ ఉపాధ్యాయుడు అయినపర్తి వీర వెంకట సత్యనారాయణ తదితరులు అభినందించారు.

వంట పాత్రల పంపిణీ



నిర్వాహకులకు వంట పాత్రలు అందిస్తున్న తహసీల్దార్ శర్మ తదితరులు

కె.గంగవరం: దంగేరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు సోమవారం వంట పాత్రలను పంపిణీ చేశారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వం ఉచితంగా సమకూర్చిన వంట పాత్రలను సర్పంచ్ కొప్పిశెట్టి రమణ, ఎంపీటీసీ సభ్యుడు కొప్పిశెట్టి లక్ష్మణ్ తదితరులు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థుల ఆరోగ్యం కోసం జగనన్న గోరుముద్ద పథకాన్ని అమలు చేస్తుందన్నారు. విద్యార్థులకు రుచిగా, శుచిగా వండి పెట్టాలని నిర్వాహకులకు సూచించారు.

సేవలకు అంతరాయం లేకుండా చర్యలు



టేకిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

కపిలేశ్వరపురం: అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది సమ్మెతో ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార సేవలకు ఎలాంటి అంతరాయం కలగకూడదనే ఉద్దేశంతో అంగన్‌వాడీ కేంద్రాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని 19 గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను సచివాలయ ఉద్యోగులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని సోమవారం ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, ఎంఈఓ కె.తాతారావు ఐసీడీఎస్ అధికారులతో కలసి సందర్శించారు. చిన్నారులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాలని సూచించారు.

కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

రామచంద్రపురం: కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె సోమవారానికి ఏడో రోజుకు చేరుకుంది. సీఐటీయూ ఆధ్వర్యంలో రామచంద్రపురం, మండపేట ప్రాజెక్టుల అంగన్‌వాడీ సిబ్బంది స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూకల బలరామ్, అంగన్‌వాడీల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి, అధ్యక్ష, కార్యదర్శులు రాణి, బేబీ, ఆదిలక్ష్మి, వి.వీరలక్ష్మి ఆధ్వర్యంలో ఈ సమ్మె కొనసాగించారు. తొలుత శిబిరాన్ని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు డాక్టర్ స్టాలిన్ ప్రారంభించారు. అనంతరం ఆర్డీఓ సుధాసాగర్‌కు వినతి పత్రం అందజేశారు.

ఓటు హక్కు అందరి బాధ్యత



ఈవీఎంలపై శిక్షణ ఇస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరరావు

రామచంద్రపురం రూరల్: ఓటు హక్కును వినియోగించుకోవడం అందరి బాధ్యతని, దీనిపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని రామచంద్రపురం తహసీల్దార్ మైలా వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలు, రెవెన్యూ సిబ్బందికి ఈవీఎంలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో ఈవీఎంలు పనిచేసే విధానం, ఓటుహక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించే విధానంపై పలు సూచనలు చేశారు. ప్రజలు ఎవరైనా గ్రూపులుగా వస్తే వారికి తహసీల్దార్ కార్యాలయంలో అవగాహన కల్పిస్తామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ జి.శ్రీనివాస్, కర్రి మహాలక్ష్మినాయుడు, ఆర్ఐ పెంకే మునీశ్వర్, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

ముచ్చటగా మూడు వేలు

- వచ్చే నెల నుంచి పెరగనున్న పింఛన్ సొమ్ము
- క్లస్టర్ పరిధిలో 64,987 మందికి ప్రయోజనం



పింఛన్ సొమ్మును లబ్ధిదారుకు అందజేస్తున్న వలంటీర్

రాయవరం: అవ్వా, తాతల మోములో ఆనందం వెల్లివిరిస్తోంది.. వితంతువులు, ఒంటరి మహిళలు తదితరులకు పెద్ద పండగొచ్చింది.. వచ్చే నెల నుంచి పింఛను సొమ్ము రూ.3 వేలు అందించనుండడంతో వారి మోముకు దరహాసం వచ్చింది.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిస్సహాయులకు ఆర్థిక భరోసా కల్పిస్తోంది. ప్రతి నెలా పింఛన్లు అందిస్తూ ఆదుకుంటోంది. ఎన్నికలకు ముందు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, కిడ్నీ బాధితులు తదితరుల కష్టాలను స్వయంగా తెలుసుకున్నారు. అప్పుడు ఇచ్చిన హామీ మేరకు పింఛన్ సొమ్మును దశల వారీగా పెంచుకుంటూ వెళ్లారు. వచ్చే ఏడాది జనవరి ఒకటి నుంచి పింఛన్ సొమ్ము రూ.3 వేలకు చేరుకోనుంది. ఫలితంగా పింఛనుదారుల కళ్లల్లో ఆనందం తొణికిసలాడనుంది. పక్షం రోజులు ముందుగానే వారికి పెద్ద పండగ వస్తున్నట్లవుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దశల వారీగా పింఛన్ల సొమ్మును పెంచడమే కాకుండా, ప్రతి నెలా ఠంఛన్‌గా పింఛన్ అందిస్తోంది.

నాడు అలా.. నేడు ఇలా..

గత టీడీపీ ప్రభుత్వం అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయకుండా, జన్మభూమి కమిటీలు ఆమోదించిన వారికి మాత్రమే ఇచ్చేదనే విమర్శలున్నాయి. పింఛన్ల మంజూరుకాక ప్రతి నెలా వృద్ధులు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారు. పింఛన్ పొందుతున్న వారు మరణిస్తేనే కొత్తవారిని ఎంపిక చేసేవారు. ఇలా పలు రకాలుగా అవస్థలు పడుతున్న వారిని ఆదుకునేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని చర్యలు తీసుకున్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రతి నెలా 1వ తేదీ ఉదయాన్నే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ అందజేస్తున్నారు. ఆర్థికంగా ఆదుకుంటూ వారిలో మనోధైర్యాన్ని నింపుతున్నారు. వివిధ రకాల పింఛనుదారులకు ఒక్కొక్కరికి ఇప్పటి వరకూ నెలకు రూ.2,750 నుంచి రూ.10 వేల వరకు పింఛన్ అందిస్తూ వారికి భరోసా ఇస్తున్నారు.

వచ్చే నెల నుంచి..

అర్హులందరికీ విడతల వారీగా పింఛన్ పెంచుతామన్న హామీ మేరకు జనవరి ఒకటి నుంచి రూ.3 వేలకు పింఛన్ పెంచి లబ్ధిదారులకు అందజేసేలా చర్యలు చేపట్టారు. డిసెంబర్‌లో రామచంద్రపురం, మండపేట క్లస్టర్ పరిధిలోని రామచంద్రపురం, మండపేట అర్బన్, రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం మండలాల పరిధిలోని 64,987 మంది వివిధ రకాల పింఛన్‌దారులకు పింఛన్లు అందజేస్తున్నారు. వీరందరికీ రూ.17,67,31,750 సొమ్ము అందించారు. వృద్ధులు, ఒంటరి మహిళలు, చేనేత, కల్లుగీత కార్మికులకు ఇస్తున్న రూ.2,750 పింఛన్ సొమ్ము జనవరి నుంచి రూ.3 వేల చొప్పున అందించనున్నారు. పింఛన్‌దారుల ముఖాల్లో సంతోషం చూసేందుకు పెరిగిన భారాన్ని ప్రభుత్వం భరించేందుకు సిద్ధమైంది.

ప్రతి నెలా క్రమం తప్పకుండా..



పెన్షన్ సొమ్మును ప్రతి నెలా క్రమం తప్పకుండా ఇంటికి వచ్చి ఇస్తున్నారు. ఇది కుటుంబ అవసరాలకు ఎంతో ఉపయోగపడుతోంది. జనవరి 1 నుంచి రూ.3 వేలు పింఛన్ పెంచుతారని చెప్పారు. ఇది మాలాంటి పేదలకు ఎంతో ఉపయోగకరం.

– టేకుమూడి కమలావతి, వృద్ధాప్య పింఛనుదారు, కపిలేశ్వరపురం

ఆదేశాలు అమలు చేస్తాం



ప్రస్తుతం సామాజిక పింఛన్ సొమ్మును నెలకు రూ.2,750 చొప్పున పంపిణీ చేస్తున్నాం. ఈ సొమ్మును ప్రతి నెలా ఒకటో తేదీన క్రమం తప్పకుండా లబ్ధిదారులకు అందజేస్తున్నాం. అధికారికంగా ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన వెంటనే పెరిగిన పింఛను సొమ్మును జనవరి 1 నుంచి ఇస్తాం.

– ఎ.శాంతి, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి, రామచంద్రపురం

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



జెడ్.మేడపాడులో ఆయుష్మాన్‌భవ కార్డును అందజేస్తున్న సాయిరామ్, సత్యనారాయణ

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం ద్వారపూడి, జెడ్.మేడపాడు గ్రామాల్లో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సమావేశాలు నిర్వహించారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యాలయాల్లో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, బీజేపీ నాయకులు మాట్లాడారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సర్పంచులు ఈతకోట కిన్నెర, కంచెర్ల చంద్రశేఖర్ చేతుల మీదుగా ఆయుష్మాన్‌భవ తదితర ప్రభుత్వ పథకాల మంజూరు కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కోటిపల్లి వీవీ సాయిరామ్, జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ మాట్లాడుతూ సంక్షేమానికి నిలువుటద్దంగా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయన్నారు. నియోజకవర్గ కో కన్వీనర్ కంకటాల మురళీకృష్ణ, పార్టీ పట్టణ, రూరల్ మండలాల అధ్యక్షులు రాయి వీర్రాజు, మద్దుల సుబ్బారావు, నాయకుడు వల్లభనేని రవీంద్రబాబు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్‌కు నోటీసులు

మలికిపురం: స్థానిక వెంకట నారాయణ థియేటర్ రోడ్డులోని క్రాంతి ట్రాన్స్‌పోర్ట్ బ్రాంచ్ నిర్వాహకుడు ఆకన రత్తయ్యకు నోటీసులు జారీ చేసినట్లు విద్యుత్ శాఖ ఏఈ మద్దూరి సతీష్ సోమవారం తెలిపారు. ఇక్కడ ఇరుకురోడ్డుతో పాటు చాలాకాలం క్రితం వేసిన తక్కువ ఎత్తులో విద్యుత్ స్తంభాలు ఉన్నప్పటికీ భారీ వాహనాలను తన షెడ్డు వద్ద నిలిపి లోడింగ్ చేస్తున్నారని, దీంతో ఇక్కడ ప్రమాదాలు జరిగిన ప్రాణ నష్టం సంభవించే ప్రమాదం ఉందని ఆయన వివరించారు. ఇక్కడ లాంగ్ విద్యుత్ స్తంభాలు వేసుకునేందుకు ట్రాన్స్‌పోర్టు యజమాని నగదు చెల్లించాల్సి ఉందని ఆయన వివరించారు. వెంటనే నగదు చెల్లించి స్తంభాలు మార్పించుకోవాలని నోటీసు జారీ చేసినట్లు సూచించారు. అలాగే మలికిపురం, లక్కవరం వర్తక కూడళ్లలో వ్యాపారస్తులు విద్యుత్ స్తంభాలకు తగిలేలా వాహనాలను నిలిపితే చర్యలు తీసుకుంటామని ఏఈ పేర్కొన్నారు.

శనైశ్చరుని హుండీ ఆదాయం రూ.5.51 లక్షలు

కొత్తపేట: మండలంలోని మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామి ఆలయం హుండీ ద్వారా రూ.5,51,696 ఆదాయం వచ్చినట్టు దేవదాయ శాఖ ఏసీ, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు. 130 రోజుల అనంతరం సోమవారం వివిధ దేవస్థానాల ఈవోలు ఎం.రాధాకృష్ణ, ఎన్‌వీఎస్ఎస్‌పీ ప్రసాదరాజు పర్యవేక్షణలో హుండీలను తెరిచి ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల వలంటీర్లు లెక్కించారు. శనైశ్చర స్వామి దేవస్థానానికి సంబంధించి హుండీల ద్వారా రూ.5,51,696, అన్నప్రసాదం ట్రస్టుకు రూ.16,500, ఈ ఆలయ క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి ఆలయం హుండీ ద్వారా రూ.25,514 ఆదాయం వచ్చినట్టు ఏసీ అండ్ ఈఓ తెలిపారు. కార్యక్రమంలో మందపల్లి వీడీసీ కన్వీనర్ సాధు చెంచయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు అడపా వెంకటేశ్వరరావు, దేవస్థానం ఎస్‌ఏ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న బ్యాంకు సిబ్బంది

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్రాక్షారామ బ్రాంచ్ మేనేజర్ అరిగెల మాణిక్యాంబికా దేవి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే పొదుపు ప్రాధాన్యం తెలుసుకోవాలని, భవిష్యత్తులో ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదంటే పొదుపు అనేది చాలా ఉపయుక్తంగా ఉంటుందని వివరించారు. డీసీసీబీ ద్వారా అందించే పొదుపు ఖాతాలు, జీరో బ్యాలెన్స్ ఖాతాలు, రుణాలు, డిపాజిట్లపై అందించే వడ్డీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక పీఏసీఎస్ చైర్మన్ దామిశెట్టి వీరవెంకట చంద్రశేఖర్, బ్యాంకు సూపర్‌వైజర్ సి.గోవిందరాజు, సొసైటీ సీఈఓ పెంకే సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.రాజేశ్వరి, ఉపాధ్యాయులు ఎ.గోవిందరాజు, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

నాన్‌స్టాప్ సాహితీ ఉత్సవాలకు పలు రికార్డులు

సఖినేటిపల్లి: తాడేపల్లిగూడెం బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో రెండు రోజులుగా శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో 30 గంటల పాటు నాన్‌స్టాప్‌గా నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహితీ కళా ఉత్సవాలు పలు ప్రపంచ రికార్డులు సొంతం చేసుకున్నాయి. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో 1500 మంది కవులు, కళాకారులతో 17, 18 తేదీల్లో నాన్‌స్టాప్‌గా నిర్వహించిన నిర్విరామ ఈ ఉత్సవాలను ధ్రువీకరిస్తూ ఆయా సంస్థలు రికార్డులు నమోదు చేశాయి. ఈ మేరకు భారత్ టాలెంట్ బుక్ ఆఫ్ రికార్డ్, ఇంటర్నేషనల్ కల్చరల్ బుక్ ఆఫ్ రికార్డ్, తెలుగు అసోసియేషన్ బుక్ ఆఫ్ రికార్డ్, మార్వెల్ బుక్ ఆఫ్ రికార్డుల్లో కళా ఉత్సవాల నిర్వహణ రికార్డులు నమోదయ్యాయి. సోమవారం వివరాలను ప్రతాప్ మీడియాకు తెలిపారు. ప్రతాప్ పర్యవేక్షణలో స్థానిక కళావేదిక ఏర్పాటు చేసిన సాహిత్య సాంస్కృతిక ర్యాలీని ముఖ్యఅతిథి హోంమంత్రి తానేటి వనిత ప్రారంభించారు. ముఖ్య అతిథి, రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు హాజరై ప్రతాప్‌ను స్థానిక కళావేదిక టీం సిద్ధం చేసిన ఆత్మీయ జ్ఞాపికను బహూకరించారు. కవులను, కళాకారులను ఒక చోటకు చేర్చిన ప్రతాప్‌ను అభినందించారు.

27న అమృత లింగేశ్వరునికి జలాభిషేకం

మామిడికుదురు: వైనతేయ గోదావరి నదీ తీరం అప్పనపల్లిలో కొలువుదీరిన ఉమా అమృత లింగేశ్వరునికి ఈ నెల 27వ తేదీ బుధవారం 108 బిందెలతో జలాభిషేకార్చన, పంచామృత అభిషేకార్చన, లక్ష బిల్వార్చన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని శ్రీశివకేశవ భక్త బృందం సోమవారం తెలిపింది. మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం శివుడు ఉద్భవించిన రోజు పురస్కరించుకుని ఈ పూజ ఏర్పాటు చేశామన్నారు. 2005 నుంచి ఈ ప్రత్యేక పూజలు చేపట్టామని చెప్పారు. ఇంత వరకు పద్దెనిమిదేళ్లు పూజలు నిర్వహించామన్నారు. 19వ ఏడాదిలో 108 బిందెలతో జలాభిషేకార్చన ఏర్పాటు చేశామని చెప్పారు.

పొగ.. సెగ



గొల్లపాలెంలో రోడ్డుపై కమ్మేసిన పొగ

కాజులూరు: రోడ్డు పక్కన ఉన్న చెత్తను తగులబెడుతుండడంతో ప్రయాణికులకు సెగ పుడుతోంది.. ప్రమాదాల్లోకి నెట్టేస్తోంది. కాజులూరు మండలంలోని పలు గ్రామాల్లో ప్రస్తుతం రైతులు పొలాల్లో తొలకరి మాసూళ్లు పూర్తిచేసుకుని దాళ్వా దమ్ములు చేసే పనిలో బిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా పొలాల్లో చెత్తాచెదారం, కలుపు మొక్కల అవశేషాలను కొందరు రోడ్డుపైకి తెచ్చి పోగులుపెట్టి నిప్పంటిస్తున్నారు. దీంతో దట్టమైన పొగ కమ్ముకుని రోడ్డంతా అలముకుంటుంది. ఫలితంగా రహదారిపై ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. కళ్లలోకి పొగ వెళ్లి విపరీతమైన మంట వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. సమస్యను దృష్టిలో ఉంచుకుని రైతులకు అధికారులు అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మళ్లీ మిమ్మల్నే గెలిపించుకుంటాం

ఆత్రేయపురం: మళ్లీ మిమ్మల్ని, సీఎం జగన్‌ను గెలిపించుకుంటామని లొల్ల గ్రామస్తులు ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి తెలిపారు. లొల్లలో సోమవారం సాయంత్రం గడప గడపకూ మన ప్రభుత్వంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు తూము రాంబాబు, తూము తాతాజీ, దాట్ల సూర్యనారాయణరాజు తదితరుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ వెళ్లి వివరించారు. లబ్ధిదారులకు గణాంకాలతో సహా వివరించి మళ్లీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కుల, మత, పార్టీ భేదాలు లేకుండా ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ సకాలంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ద్వారా డైరెక్ట్‌గా తమ ఖాతాలకే జమవుతున్నాయని ప్రజలు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి వద్ద హర్షం వ్యక్తం చేశారు. ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, మండల పార్టీ కన్వీనర్ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

కార్తికేయ... శరణమయ్యా

- భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్ఠి
- ఆలయాల్లో భక్తుల రద్దీ



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు



ఏడిదలో సంగమేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



అంగరలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారు

రామచంద్రపురం రూరల్: కార్తికేయ.. శరణమయ్యా అంటూ ఆ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని భక్తజనం కొలిచింది.. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో సుబ్రహ్మణ్య షష్ఠిని సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామివారి దేవస్థానంలో వేంచేసి ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామిని తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. పూలు, పడగలు సమర్పించారు. సాయంత్రం సర్ప వాహనంపై స్వామివార్ల గ్రామోత్సవం, వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. షష్ఠికి భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు భోజన సౌకర్యం కల్పించారు. హసన్‌బాదలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో షష్ఠి ఉత్సవాలను ఆలయ ధర్మకర్త సామంచి సత్యనారాయణ మూర్తి, ఈఓ ఎంవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఉండి వీరభద్రశర్మ బ్రహ్మత్వంలో స్వామివారికి ఉదయం నుంచీ అభిషేకాలు చేశారు. స్వామివారి రథోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, గ్రామ పెద్దలు చింతపల్లి వీరభద్రరావు, చోడిశెట్టి వీరభద్రరావు, చెక్కా చినసోమరాజు, బొల్లం సత్తిరాజు, ఎంపీ బోస్ తనయుడు సూర్యప్రకాశ్ తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. రథోత్సవంలో తొక్కిసలాట జరగకుండా ద్రాక్షారామ ఎస్సై సురేంద్ర చర్యలు తీసుకున్నారు. వెల్లలో సోమేశ్వరస్వామి, వేణుగోపాలస్వామివార్ల దేవాలయంలో సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిగాయి. నరసాపురపుపేట ఆలయంలో ఆలయ అర్చకుడు శ్రీనివాస్‌దత్తు, పవన్‌ల బ్రహ్మత్వంలో వల్లీ దేవసేన సుబ్రహ్మణ్య స్వామివార్ల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రామచంద్రపురం: స్థానిక బాలాత్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయానికి తెల్లవారుజామున 4 గంటల నుంచే రద్దీ నెలకొంది. భక్తుల రద్దీ మధ్యాహ్నం వరకూ కొనసాగింది.

ఆలయాలు కిటకిట

రాయవరం: చారిత్రక ఆలయాలైన సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి, వెంటూరులోని ఉమా సమేత సోమేశ్వరస్వామి ఆలయాలతో పాటు రాయవరం పార్వతీ సమేత రాజేశ్వరస్వామి ఆలయం, చెల్లూరులోని అగస్త్యేశ్వరస్వామి, వెదురుపాక, లొల్లలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలు ఆలయాల వద్ద షష్ఠి తీర్థాలు నిర్వహించారు. సోమేశ్వరం శివాలయం, రాయవరం రాజేశ్వరస్వామి ఆలయాల్లో అర్చకులు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ, విలపర్తి ఫణిధర్‌శర్మ, శశిధర్‌శర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం ఆయా గ్రామాల్లో స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. పసలపూడిలో జరిగిన షష్ఠి ఉత్సవాల్లో జెడ్పీటీసీ సభ్యులు నల్లమిల్లి మంగతాయారు, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి, పారిశ్రామికవేత్త చింతా కృష్ణారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ చింతా ప్రసాద్‌రెడ్డి, అభివృద్ధి కమిటీ సభ్యులు పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి, చైతన్య రాజబాబు, డాక్టర్ గిరిబాల, పడాల అప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాజులూరు: షష్ఠి ఉత్సవాల సందర్భంగా కాజులూరు, గొల్లపాలెం, ఆర్యావటం, పెనుమళ్ల, ఉప్పుమిల్లి శివారు గొప్పిరేవు గ్రామాల్లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జాతరల సందర్భంగా ఆలయాల వద్ద ఆర్కెస్ట్రా, నాటకాలు, బుర్రకథ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి భారీఎత్తున బాణసంచా కాల్చారు.

కె.గంగవరం: అముజూరు శివాలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద అర్చకుడు వెలవలపల్లి అరుణ్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. మహిళలు సామూహిక పూజలు చేశారు. పామర్రు మల్లేశ్వరస్వామి ఆలయంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తామరపల్లిలో ఆలయం వద్ద తీర్థంతో సందడి నెలకొంది. ఇక్కడ భారీ అన్నసమారాధన జరిగింది. కోటిపల్లిలోని సోమేశ్వర స్వామివారి ఆలయానికి భక్తుల తాకిడి నెలకొంది.

కపిలేశ్వరపురం: అంగరలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. అర్చకులు కొమాళ్లపల్లి సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బృందం స్వామివారిని విశేషంగా అలంకరించారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లోని విద్యాలయాలకు సెలవు ప్రకటించడంతో ఇక్కడి తీర్థం సందడిగా జరిగింది. వల్లూరు, కపిలేశ్వరపురంలలో షష్ఠి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. నేలటూరులోని బసవేశ్వరస్వామి ఆలయంలో చేనేత వృత్తిదారులు షష్ఠి ఉత్సవంలో పాల్గొన్నారు. వారి ఆచారం నిమిత్తం స్వామివారికి అరటి గెలలను సమర్పించారు. మండపేట మండలం ఏడిదలోని సంగమేశ్వరస్వామివారిని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దర్శించుకున్నారు. మండపేట పట్టణం, ద్వారపూడి, అర్తమూరులలో నిర్వహించిన షష్ఠి ఉత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అర్తమూరులో ఎస్‌బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సత్తి బుల్లిస్వామిరెడ్డి, మాణిక్యం దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామానికి చెందిన చిర్ల వెంకట రామకృష్ణారెడ్డి, దేవిశ్రీ దంపతులు వారి కుమార్తె రూప అన్విత పేరున స్వామికి కేజీపావు వెండితో తయారు చేసిన నాగాభరణాన్ని సమర్పించారు.



హసన్‌బాదలో సుబ్రహ్మణ్యస్వామివారి రథోత్సవం



పసలపూడిలో సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో భక్తుల పూజలు



గొల్లపాలెంలో ఆలయం వద్ద భక్తులు



ఏడిద సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తుల బారులు